గాయపడిన బాలికకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రమాదానికి గురై చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాలికకు లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య సభ్యులు ఆర్థికసాయం శుక్రవారం అందజేశారు. గంగిరెడ్డిపల్లెకు చెందిన బాలిక వెన్నెల తీవ్రంగా గాయపడి చికిత్స పొందేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయాన్ని స్థానికులు లయన్స్ క్లబ్ ప్రతినిధులకు చేరవేశారు. స్పందించిన లయన్ ఎ.వెంకటసుబ్బయ్య, కె.సంజీవరెడ్డిలు రూ. 22 వేలమొత్తాన్ని బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి కొండూరు జనార్దన రాజు, గొబ్బూరి కోటేశ్వరరావు, రఘు పాల్గొన్నారు.

01 JUNE టిక్..టిక్..!

- ఎగ్జిట్‌పోల్ ఫలితాల కోసం నిరీక్షణ
- అభ్యర్థుల్లో పెరుగుతున్న హార్ట్‌బీట్
- తగ్గని బెట్టింగ్ రాయుళ్ల జోరు

ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో హార్ట్‌బీట్ పెరిగిపోతోంది. కౌంటింగ్ తేదీ దగ్గర పడుతున్నకొద్దీ వేగంగా కొట్టుకుంటోంది. ఫలితంగా ఎన్నికల బరిలో నిలిచిన 230 మంది అభ్యర్థులు ఒత్తిడిని అధిగమించడం కోసం విహారం పేరిట దేశంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన తెలిసిందే. శనివారం సాయంత్రం దేశంలో ఏడవ దశ ఎన్నికలు ముగిసిన అనంతరం ఎగ్జిట్‌పోల్ ఫలితాలు వెలువడే అవకాశం కనిపిస్తోంది. బెట్టింగ్ పేరిట కోట్లాది రూపాయల పందేలు సాగించిన పందెంరాయుళ్లలోనూ ఎనలేని ఉత్కంఠ పెరిగిపోతోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో ఎక్కడ చూసినా ఎగ్జిట్‌పోల్ జపం నడుస్తోంది. సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో ఉత్కంఠ రాజ్యమేలుతోంది. శనివారం సాయంత్రం దేశంలోని ఏడవ దశ పోలింగ్ ముగిసిన అనంతరం ఎగ్జిట్‌పోల్ ఫలితాలు వెలువడనున్నాయి. గడియారం ముళ్లు చేసే టిక్ ..టిక్ శబ్దం తరహాలో అభ్యర్థులు, బెట్టింగ్‌రాయుళ్లు, రాజకీయ పరిశీలకుల గుండెలు ప్రతిధ్వనిస్తున్నాయి. వైఎస్ఆర్ జిల్లాలో కడప పార్లమెంట్ స్థానం సహా కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలో రాజంపేట పార్లమెంట్ స్థానం సహా రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి అసెంబ్లీలు ఉన్నాయి. వీటి పరిధిలో 50 మంది పార్లమెంట్ అభ్యర్థులు, 180 మంది అసెంబ్లీ అభ్యర్థులు బరిలో నిలిచిన సంగతి తెలిసిందే. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల దగ్గర నుంచి నోటిఫికేషన్, ఎన్నికల ప్రచారం, స్క్రూటినీ, ఉపసంహరణ, పోలింగ్ అనంతరం కౌంటింగ్ దశకు చేరుకుంది. పోలింగ్ అనంతరం పార్లమెంట్, ఎమ్మెల్యే అభ్యర్థులకు కౌంటింగ్ దశ ఎనలేని ఉత్కంఠను కలిగిస్తోంది.

కౌంటింగ్ ఏజెంట్ల నియామకంపై దృష్టి అభ్యర్థులు సారించారు. కౌంటింగ్‌లో ఎటువంటి ఆటంకాలు, లోటుపాట్లను డేగకన్నుతో కనిపెట్టి, పరిష్కారానికి పట్టుబట్టాల్సి ఉంది. ఇటువంటి వ్యవహారాల్లో అత్యంత జాగరూకతతో వ్యవహరించాల్సి ఉంటుంది. సార్వత్రిక ఎన్నికలను పరిశీలిస్తే పోటాపోటీగా నడిచిన సంగతి తెలిసిందే. వైఎస్ఆర్ జిల్లాలో సుమారు 50 వేల, అన్నమయ్య జిల్లాలో సుమారు 26 వేల వరకు మహిళల ఓటింగ్ శాతం పెరుగుదలను మినహాయిస్తే నువ్వా నేనా అంటూ సాగిన ఎన్నికల క్రతువులో కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. క్లైమాక్స్ దశలో గట్టిగా పట్టుబట్టే సమర్థులైన అభర్థులను నిలబెట్టుకునే ప్రయత్నాల్లో నిలిచినట్లు తెలుస్తోంది. ఎన్నికల అధికార యంత్రాంగం కడప, అన్నమయ్య జిల్లాల్లో పకడ్బందీగా కౌంటింగ్ ఏర్పాట్లు చేస్తోంది.

కౌంటింగ్ దగ్గర పడే కొద్దీ ఉత్కంఠ పెరిగిపోతోంది. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాలోని సుమారు నాలుగు వేలకుపైగా గ్రామాల్లో పందేలజోరు కొనసాగుతోంది.కడప, రాజంపేట పార్లమెంట్ స్థానాల పరిధిలోని 13 అసెంబ్లీ స్థానాల్లో బెట్టింగ్ బంగార్రాజుల చెలరేగిపో తున్నారు.రూ.లక్ష మొదలుకుని రూ.10 లక్షల వరకు పందేల జోరు కొనసాగుతోంది. రూ.లక్షకు, రూ.లక్షన్నర నుంచి రూ.మూడు లక్షల వరకు పందేలు సాగుతున్నాయి. పోలింగ్ నుంచి ఎగ్జిట్‌పోల్ వరకు సాగిన బెట్టింగ్ ప్రక్రియ ఒకతరహాలో సాగితే ఎగ్జిట్‌పోల్ నుంచి కౌంటింగ్ రోజు వరకు మరో తరహాలో బెట్టింగుల తీరు సాగే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలతో ఆగకుండా రాష్ట్రంలో ప్రభుత్వం అధికార వైసిపి, కూటముల్లో ఎవరిదనే అంశంపై పెద్ద ఎత్తున పందేలు జరుగుతుండడం సర్వత్రా ఉత్కంఠను కలిగిస్తోంది.

రౌడీషీటర్లపై పోలీస్ కొరడా?

ఉమ్మడి జిల్లాలో 1,638 మంది గుర్తింపు
27 మంది జిల్లా బహిష్కరణ
248 మంది గృహ నిర్బంధం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పోలీసులు కొరఢా ఝులిపించారు. జూన్ నాలుగున నిర్వహించనున్న కౌంటింగ్ అనంతరం హింస చోటుచేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు కనిపిస్తోంది. కడప జిల్లాలో 1,038 మంది రౌడీషీటర్లు, అన్నమయ్య జిల్లాలో 600 మంది రౌడీషీటర్లను గుర్తించింది. వీరిలో అనేకులను అదుపులోకి తీసుకోవడం, గృహనిర్బంధం చేయడం, హింసకు పాల్పడే అవకాశం ఉందని గుర్తించిన రౌడీషీటర్లను జిల్లా బహిష్కరణ వంటి గట్టి చర్యలు తీసుకుంది. కడప జిల్లాలో 1,038 మంది రౌడీషీటర్లలో 652 మందిని ముందస్తు అరెస్టు చేసింది. 131 మందిని గృహ నిర్బంధం చేసింది. 21 మంది రౌడీషీటర్లను జిల్లా బహిష్కరణ చేసినట్లు తెలిసింది. అన్నమయ్య జిల్లాలో 600 మంది రౌడీషీటర్లను గుర్తించారు. వీరిలో 110 మందిని గృహ నిర్బంధంలోకి తీసుకున్నారు. హింసకు అవకాశం ఉందని భావించిన ఆరుగురిని జిల్లా బహిష్కరణ చర్యలు చేపట్టినట్లు సమాచారం. దీనిపై అన్నమయ్య జిల్లా ఎస్పీని సంప్రదించగా ఐదు శాతం మందిని ఎక్స్‌టెన్షన్ చర్యలు తీసుకున్న మాట వాస్తవమేనని అంగీకరించారు. కడప జిల్లా ఎస్పీని ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

పనులు వేగంగా పూర్తి చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. శుక్రవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా అన్నమయ్య సర్కిల్, కృష్ణ సర్కిల్, గోకుల్ లాడ్జి రోడ్, దేవుని కడప రోడ్డును ఆర్ అండ్‌బి, ఇంజినీర్, టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులతో కలిసి పరిశీలించారు. అన్నమయ్య జంక్షన్ నుంచి కృష్ణ సర్కిల్ వరకు నూతనంగా నిర్మిస్తున్న డివైడర్, స్టోన్ క్లోడింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అన్నమయ్య జంక్షన్ నుంచి కృష్ణ సర్కిల్ వరకు ఏర్పాటు చేసిన డ్రైన్ పై హోల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. స్టోన్ క్లాడింగ్ పనులను ప్రారంచేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. డివైడర్‌లో గ్రీనరీ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని హార్టికల్చర్ విభాగ అధికారులను ఆదేశించారు. కృష్ణా జంక్షన్ కల్వర్ట్ లో మాన్‌హోల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. కృష్ణ జంక్షన్ నుంచి గోకుల్ జంక్షన్ వరకు డివైడర్ పై గ్రిల్స్, గ్రిల్ పెయింటింగ్ చేయించాలని సూచించారు. దేవుని కడప రోడ్ ప్లాజా వద్ద ప్లాంటేషన్ పనులు చేపట్టాలన్నారు. మార్కెట్ యార్డ్ జంక్షన్ డ్రైన్ గ్యాప్స్ పనులను ప్రారంభించాలని ఆర్అండ్‌బి విభాగ అధికారులను ఆదేశించారు.

మాసాపేట సర్కిల్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్

నారాయణ కార్పొరేటు స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ డిమాండ్

స్కూల్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరంలో దుర్గమ్మ గుడి వద్ద ప్రభుత్వ గుర్తింపు లేకుండా తల్లిదండ్రులను మోసం చేసి ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న నారాయణ కార్పొరేటు స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం అనుమతి లేకుండా నడుస్తున్న నారాయణ కార్పొరేట్ స్కూల్ ఎదురుగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సగిలి .రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జిల్లా లో నారాయణ కార్పొరేటు స్కూల్ ప్రభుత్వ గుర్తింపు లేకుండా యథేచ్ఛగా అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదంటే కారణం ఏంటి అన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం స్కూల్‌లో పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫారాలు వంటివి అమ్మకూడదని తెలిపారు. కానీ ప్రభుత్వ ధరల కంటే వేల రూపాయలు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అమ్ముతున్నారని చెప్పారు. తప్పుడు ప్రచారాలతో తల్లిదండ్రులను నారాయణ యాజమాన్యం మోసం చేస్తోందని చెప్పారు. ఇప్పటికే అడ్మిషన్లు పూర్తిగా నిర్వహించారని పేర్కొన్నారు. కేవలం కడపలోనే కాదని జిల్లా మొత్తం ఇదే విధంగా చదువును సరుకుగా మార్చి కార్పొరేటు స్కూల్స్ యాజమాన్యాలు అమ్ము తున్నారన్నారు. వీరికి విద్యా శాఖా అధికారులు మద్దతు మెండుగా ఉందని చెప్పారు.పబ్లిక్ గా అడ్మిషన్లు, పుస్తకాలు, యూనిఫాంలో అమ్ముతున్నా విద్యాశాఖ అధికారులు వీరిపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. తక్షణమే దుర్గమ్మ గుడి వద్ద ఉన్న గుర్తింపులేని నారాయణ స్కూల్ యాజమాన్యాన్ని సీజ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్, మనోజ్, డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు అంజి పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికీ విరమణ తప్పనిసరి

ప్రజాశక్తి - కడప అర్బన్

విరమణ ప్రతి ఉద్యోగికి తప్పనిసరి అని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ విరమణ చేస్తున్న కుప్పాల శ్రీనివాసులును ఐఎంఎ హాలులో సత్కరించారు. ఈ సందర్భంగా అమీరుద్దీన్ మాట్లాడుతూ శ్రీనివాసులు 36 సంవత్సరాలుగా సంస్థలో వివిధ హోదాల్లో పనిచేస్తూ అధికారులు చెప్పిన ప్రతి పని అంకితభావంతో చేశారని పేర్కొన్నారు. ఇప్పటి తరం ఉద్యోగులకు శ్రీనివాసులును ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థలో కార్యదర్శి పనిచేస్తున్న కాటం ప్రకాష్ మాట్లాడుతూ శ్రీనివాసులు విధి నిర్వహణలో సమయపాలన పాటించడం, పాఠకులకు సేవలు అందిస్తూ మన్నలు పొందారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రధాన కార్యదర్శి నాదెండ్ల బాబ్జీ మాట్లాడుతూ గతంలో ఉద్యోగుల సంఘంలో ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ఉద్యోగుల హక్కుల కోసం నిర్వహించిన పోరాటంలో భాగస్వాములయ్యారని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి పరిష్కారం సాధించుకుందామని చెప్పారు. సన్మాన గ్రహీత కుప్పలా శ్రీనివాసులు మాట్లాడుతూ సంఘంలో పనిచేస్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేశానని తెలిపారు. భవిష్యత్తులోనూ ఉద్యోగుల హక్కుల కోసం తన వంతు ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. అనంతరం శ్రీనివాసులును సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శి దేవరాజులు,సుబ్బరాజు, చిత్తూరు జిల్లా రిటైర్డ్ కార్యదర్శి సాంబశివారెడ్డి, విరమణ ఉద్యోగులు, బంధువులు, మిత్రులు పాల్గొన్నారు.

ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్

శంకర్ బాలాజీని సస్పెండ్ చేయాలి

- సిపిఎం పూర్వపు జిల్లా కార్యదర్శి బి.నారాయణ డిమాండ్
- సిపిఎం కార్యాలయం జోలికి వస్తే ఐక్యంగా ప్రతిఘటిస్తాం
- అఖిలపక్ష నాయకుల హెచ్చరిక

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం పూర్వపు జిల్లా కార్యదర్శి బి.నారాయణ

ప్రజాశక్తి- కడప అర్బన్

యాదాళ పిచ్చయ్య ట్రస్ట్‌కు అర్హత లేని సభ్యులకు కడప ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ సహకరించడం దారుణమని, కలెక్టర్ స్పందించి ఆయన్ను వెంటనే సస్పెండ్ చేయాలని సిపిఎం పూర్వపు జిల్లా కార్యదర్శి బి.నారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం పాత బస్టాండ్‌లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ 30 ఏళ్ల కిందట యాదాళ పిచ్చయ్య ట్రస్ట్ స్థలాన్ని అప్పట్లో కొంతమంది రాజకీయ పలుకుబడి ఉన్న కబ్జాదారులు అక్రమంగా ప్రవేశించి కబ్జా చేశారని పేర్కొన్నారు. వారి నుంచి ట్రస్టు స్థలాన్ని కాపాడాలని ట్రస్ట్ పెద్దలు సిపిఎం జిల్లా కార్యాలయానికి వచ్చి కోరారని తెలిపారు. కార్యాలయ నిర్మాణానికి తాము సహకరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ స్థలం ప్రజల కోసం ఉపయోగపడాలని చెప్పారని పేర్కొన్నారు. ఆ మేరకు అప్పటి సిపిఎం నాయకత్వం, జిల్లాలోని కార్యకర్తలు కబ్జాదారులను తరిమి సిపిఎం కార్యాలయాన్ని నిర్మించి ట్రస్ట్ స్థలాన్ని కాపాడారని చెప్పారు. అప్పటి ట్రస్ట్ సభ్యులు సిపిఎం కార్యాలయ నిర్మాణానికి 20 సెంట్ల స్థలం కేటాయిస్తున్నట్లు తెలియపరచారని పేర్కొన్నారు. ఆమేరకే కార్యాలయం నిర్మాణం చేశారని గుర్తు చేశారు. తర్వాత సదరు ట్రస్ట్ స్థలం ప్రభుత్వ దేవాదాయ శాఖ ఆధీనంలోకి వెళ్లిందని తెలిపారు. 1920కి ముందు నాటి మద్రాస్ బ్రిటిష్ రెసిడెన్సీలోని రిజిస్టర్ కార్యాలయంలో ఈ ట్రస్ట్ కార్యదర్శిగా కలెక్టర్, ట్రస్ట్ అధ్యక్షులుగా జిల్లా మెజిస్ట్రేట్, ట్రస్ట్ మెంబర్‌గా స్వచ్ఛంద సంఘ సేవకున్ని ఏర్పాటు చేసి ట్రస్టు సభ్యునిగా యాదాళ పిచ్చయ్య ఒక్కడిగా మాత్రమే ఉండి నియమించుకునే విధంగా నిబంధనలు తయారు చేశారన్నారు. సంఘసేవ కార్యక్రమాలకు మాత్రమే ఈ వినియోగించేటట్టుగా నిబంధనలు రూపొంది ంచామన్నారు. కాలక్రమంలో యాదళ పిచ్చయ్య కుమారుని తరఫు వారసులు లేకుండా పోయారని చెప్పారు. హిందూ వారసత్వ చట్టం నిబంధనల ప్రకారం లేకుండా పోయారన్నారు. వాస్తవాలు ఇలా ఉండగా కూతురి తరపు వారసులు అర్హత లేని వారు ఈ ట్రస్టులోకి సభ్యులుగా చేరటానికి అధికారంలో ఉన్న ప్రభుత్వాలను ప్రభావితం చేశారని తెలిపారు. చట్ట విరుద్ధంగా అక్రమ పద్ధతిలో ట్రస్ట్ సభ్యులుగా నకిలీ పత్రాలతో, ఫోర్జరీ సంతకాలతో చేరి, ప్రభుత్వ దేవాదాయ శాఖ అధికారులతో కలిసి రికార్డులను తారుమారు చేసి ట్రస్టు ఆస్తులను, ట్రస్ట్ నిబంధనలకు భిన్నంగా అనుభవించడానికి, విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ అర్హతలేని, చట్ట విరుద్ధమైన కార్యకలాపాలు నిర్వహిస్తున్న జ్వాలా చైతన్య ప్రసాద్, హర్ష అనే వ్యక్తులు రావటంపై వీడియోలు తమ వద్ద ఉన్నాయని వాటిని జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. కడప అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శంకర్ బాలాజీని ఆర్థిక అంశాలతో ప్రభావితులను చేసి, కోట్లు విలువచేసే ప్రజా ప్రయోజనాల కోసం ఏర్పర్చిన ట్రస్ట్ స్థలాన్ని దురాక్రమణ చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. దానికి సంబంధించిన రుజువులు, ఆధారాలతో హైకోర్టులో రిట్ పిటిషన్ వేసి, సిపిఎం వ్యాజ్యాన్ని నడుస్తుందని తెలిపారు. హైకోర్టు తుదితీర్పు రాకమునుపే, సదరు దేవాదాయ శాఖ స్వాధీర అనుభవంలో ఉన్న స్థలాన్ని హక్కు లేని ప్రయివేటు వ్యక్తులు దురాక్రమం చేయడానికి సిపిఎం కార్యాలయం తొలగించడానికి ప్రయత్నించారని వారు తెలిపారు. సిపిఎం కార్యాలయంలో ఉన్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బెల్లం మనోహర్ పై దౌర్జన్యం, కుల దూషణ, దురాక్రమణ, అక్రమ ప్రవేశం, హత్యా ప్రయత్నం, లాంటివికి ప్రయత్నం చేరని గుర్తు చేశారు. ఇప్పటికైనా ట్రస్టు పూర్వపు పెద్దలు సిపిఎం జిల్లా కమిటీకి ఇచ్చిన స్థలం దానాన్ని చట్టబద్ధం చేసి, లీజుకు కానీ, రెంటుకు కానీ ఇవ్వటానికి ప్రభుత్వ దేవాదాయ శాఖ వారు సహకరించాలని కోరారు. అర్హత లేని ట్రస్ట్ సభ్యులుగా చెప్పుకుంటున్న వారికి కడప అసిస్టెంట్ లేబర్ కమిషన్ ఎన్నికల కోడ్ ఉన్న సందర్భంలో 144 ఐపిసి, 30 యాక్ట్ అమల్లో ఉన్న సమయంలో అవినీతికి పాల్పడి అక్రమ దారులకు సహకరించిన కారణంగా కలెక్టర్ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం కార్యాలయం జోలికి వస్తే ఐక్యంగా ప్రతిఘటిస్తామని తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి హరిప్రసాద్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. సత్తార్, సిపిఐ జిల్లా సీనియర్ నాయకులు ఎల్.నాగ సుబ్బారెడ్డి, బిఎస్‌పి రాష్ట్ర నాయకులు ఎస్.గుర్రప్ప. ఆప్ మాజీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసులు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డబ్ల్యూ రాము, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి రమణయ్య పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యాలయానికి నష్టప రిహారం చెల్లించకుండా, దాడి చేస్తే సమిష్టిగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, కార్యదర్శివర్గ సభ్యులు ఐ.ఎన్.సుబ్బమ్మ , బి.మనోహర్, ఏ .రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసులు రెడ్డి, దస్తగిరి రెడ్డి, వి.అన్వేష్ వివిధ ప్రజాసంఘాల, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

యువత ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలి

- ప్రిన్సిపల్ జి.రవీంద్రనాథ్

మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్

ప్రజాశక్తి - కడప

యువత పొగాకు వైపు వెళ్లకుండా సరైన మార్గంలో పయనిస్తూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.టరవీంద్రనాథ్ సూచించారు. శుక్రవారం ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ యువత పొగాకు వైపు వెళ్లకుండా సరైన మార్గంలో ప్రయాణిస్తూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని పేర్కొన్నారు. పొగాకు వల్ల ఆరోగ్య సమస్యలే కాకుండా ఆ కుటుంబంలోని వారందరూ బాధపడాల్సి వస్తుందని వాపోయారు. . వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ పొగాకు ఆరోగ్యానికి చాలా హానికరమని, నివారించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శివరామకృష్ణ మాట్లాడుతూ పొగాకు వాడటం వల్ల ఊపిరితిత్తులు, నోటి కేన్సర్లకు గురవుతారని, అందులోని నికోటి అనేటువంటి రసాయనిక పదార్థం వల పొగాకుకు బానిసగా మారుతారని తెలిపారు. ఈ సమస్య ముఖ్యంగా నిరక్షరాశుల్లోనే కాకుండా చదువుకున్న యువత కూడా ముఖ్యంగా 18 నుంచి 20 సంవత్సరాల లోపు వాళ్ళు ఎక్కువగా పొగాకు బారిన పడుతున్నారని పేర్కొన్నారు. పొగాకు జోలికి వెళ్లకుండా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అంకాల నాగరాజు, డాక్టర్ లీలావర్ధిని, రామచంద్ర అధ్యాపకులు డాక్టర్ రామచంద్ర సుధాకర్ రెడ్డి భూషణ్ రెడ్డి, అనిత డాక్టర్ జమాల్ బాషా డాక్టర్ సారధి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. **చాపాడు :** పొగాకు మన శరీరంలో ప్రతి అవయవాన్ని నాశనం చేస్తుందని చాపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జి. రాజేష్ కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వాస్పత్రికి రోగులకు, ప్రజలకు తెలియజేశారు.చాపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ 13-15 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు సిగరెట్లు, బీడీలు, చుట్టలు, పొగాకు ఉత్పత్తులు, గుట్కా లాంటివి వినియోగిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి. కావ్యమాధురి ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తూ పొగాకు వల్ల చాలా జబ్బులు వస్తాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఓబులేసు , శ్రీవాణి,మండల ఆరోగ్య విస్తరణ అధికారి యం. రాఘవయ్య సూపర్ వైజర్స్ సరస్వతి, బాబురెడ్డి, ఫార్మసీ అధికారి సుభాషిణి, సీనియర్ అసిస్టెంట్ లోకేష్, ల్యాబ్ టెక్నీషియన్ పద్మావతీ, స్టాఫ్ నర్స్ శిరోమణి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, రోగులు, ప్రజలు పాల్గొన్నారు.

5న పర్యావరణ పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 5న విద్యార్థులకు, ప్రజలకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు పర్యావరణ మిత్ర సమూహం సొసైటీ సభ్యులు డాక్టర్ ప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ దినోత్సవంలో 1 నుంచి 5 వ తరగతి విద్యార్థులు, 'పక్షులు వాలిన చెట్టు' చిత్రం గీయాలన్నారు. 6 -10 తరగతుల విద్యార్థులు 'నేనైతే చెట్టును ఇలా రక్షిస్తాను' అనే అంశంపై చిత్రం గీయాలన్నారు. ఇంటర్ నుంచి ఏదైనా డిగ్రీ చదువుతున్న వారు 'మనిషి జీవన చక్రంలో చెట్టు' అనే అంశంపై చిత్రం గీయాలని చెప్పారు. 23 సంవత్సరాల పైబడిన వారికి ' మనిషికి చెట్టే ఆధారం' అనే అంశంపై చిత్రం గీయాలని పేర్కొన్నారు. ఈ నాలుగు విభాగాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని తెలిపారు. చిత్రాన్ని గీయడానికి అవసరమైన రంగులు కుంచెలు, రైటింగ్ ప్యాడ్ సామాగ్రి విద్యార్థులే తీసుకుని రావాలని పేర్కొన్నారు. ఎ4 డ్రాయింగ్ పేపర్‌ను సమూహం వారే సరఫరా చేస్తారని తెలిపారు. రెండు గంటల సమయంలో చిత్రాన్ని గీయాలని పేర్కొన్నారు. జూన్ 5న ఉదయం 9 గంటల నుంచి 11 గంటల లోపు ముగించాలని తెలిపారు. అనంతరం ప్రశంసా పత్రాలు, బహుమతుల ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు. పోటీలు నగరం లోని ఐటిఐ సమీపంలో ఫ్లై ఓబర్ బ్రిడ్జి కింద భగత్‌సింగ్ పార్క్ వద్ద నిర్వహి స్తారన్నారు. బహుమతులు ప్రముఖుల సమక్షంలో విద్యార్థులకు అందజేస్తామన్నారు. వివరాలకు 6281560089లో సంప్రదించాలని తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ తరగతులు

ప్రజాశక్తి - కడప అర్బన్

2024 -25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఈనెల 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఆర్ఐఒ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయివేట్ ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ ఆదర్శ కళాశాలలో తరగతులను ప్రారంభించాలన్నారు.

చిత్తూరు జట్టుపై అనంతపురం విజయం

ప్రజాశక్తి - కడప

సెంచరీ చేసిన కడప జట్టు బ్యాట్‌మెన్ వంశీకృష్ణ

కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సీనియర్ వన్డే క్రికెట్ అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా శుక్రవారం కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టుపై అనంతపురం జట్టు 143 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 47.4 ఓవర్లలో 289 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆ జట్టులోని అర్జున్ టెండూల్కర్ 61, బి. వినయ్ కుమార్ 52 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని రెడ్డి ప్రకాష్ 4, వర్షిత్ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 290 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 32.3 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌట్ అయ్యి ఓటమి పాలు చెందింది. ఆ జట్టులోని ధరణి కుమార్ నాయుడు 26 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని దీపం సాయి రెండు వికెట్లు తీసుకున్నాడు. **కడప జట్టుపై నెల్లూరు విజయం..** ఎసిఎ సౌత్ జోన్ సీనియర్ మెన్స్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా శుక్రవారం కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప జట్టుపై 8 వికెట్ల తేడాతో నెల్లూరు ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కడప జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 46.1 ఓవర్లలో 229 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆ జట్టులోని టి వంశీకృష్ణ 100 పరుగులు (నాటౌట్) చేశాడు. అనంతరం 230 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 36.5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి ఓవర్లలో 230 పరుగులు చేసి 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆ జట్టులోని ఫర్హాద్ ఖాద్రి 102, నిఖిలేష్ 56 పరుగులు చేశారు. కడప జట్టులోని మహమ్మద్ రఫీ 2 వికెట్లు తీసుకున్నాడు.

నిప్పులు చెరుగుతున్న భానుడు

అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న జనం - రాత్రి అయినా వీడని వడగాల్పులు

- ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి - రోడ్లపై కనిపించని ప్రజానీకం

- పెరుగుతున్న కరెంటు వాడకం

ప్రజాశక్తి - వేంపల్లె

భానుడు విజృంభిస్తుండటంతో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ఉదయం 8 గంటల నుండి ఎండలు మండిపోతున్నాయి. సాయంత్రం ఆరు గంటలు దాటినా వేడి గాలులు తగ్గని పరిస్థితి నెలకొంది. తీవ్రమైన ఎండ కారణంగా మధ్యాహ్న సమయంలో వేంపల్లెలోని ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా ఉంటున్నాయి. మూడు రోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో ప్రజలు నానా ఇబ్బంది పడుతున్నారు. పగటిపూటేగాక రాత్రి సమయంలోనూ వేడి గాలులు వీస్తున్నాయి. ప్రతి ఒక్కరికీ చెమటలు, ఉక్క పోత తప్పట్లేదు. ఇళ్లల్లో ఎసిలు ఉన్న వారు మాత్రం వేడి సెగ లేకుండా ఉపశమనం పొందుతున్నారు. ఇక ఫ్యాన్లు వేసుకున్న వారికి ఉపశమనం లేకుండా పోవడంతో వారి పరిస్థితి అగ్ని గుండంలో కూర్చున్నట్టుగా ఉంది. వేడిగాలి వస్తుండటంతో వృద్ధులు, ముఖ్యంగా చిన్న పిల్లలు, బాలింతలు అల్లాడిపోతున్నారు. ఫ్యాన్, కూలర్ ఉన్నప్పటికీ ఉక్కపోత తప్పట్లేదు. నిరంతరం ఫ్యాన్లు, కూలర్లు నడుస్తుడడంతో విద్యుత్ బిల్లులు కూడా భారీగా వస్తున్నాయి. ఎండ తీవ్రత ఎక్కువ కావడం, పాటు వేడి గాలులు వీస్తుండడంతో విద్యుత్ వాడకం ఎక్కువైందని ప్రజలు అంటున్నారు. ఫ్యాన్, కూలర్ వేయక పోతే రాత్రి సమ యంలో దోమల బెడద ఉంటోందని దీంతో పగలు, రాత్రి ఫ్యాన్‌లు, కూలర్లు నిరంతరం తిరుగుతూనే ఉండాల్సిన పరిస్థితి రావడంతో ఒట్టింపు బిల్లులు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. అధిక ఉష్ణోగ్రతలకు ఇళ్లపై ఉన్న ట్యాంకుల్లోని నీరు సైతం వేడెక్కి పోతుండటంతో రాత్రి 8,9 గంటలైనా వేడి నీరే వస్తున్నాయని ప్రజలు అంటున్నారు. ఎండ తీవ్రంగా ఉండడంతో వేంపల్లెలో 144 సెక్షన్ అమల్లో ఉన్నట్లుంది. ఉదయం 10లోపు, సాయంత్రం 7గంటల తర్వాత ప్రజలు బయటకు వస్తున్నారని దీంతో వ్యాపారం పూర్తిగా తగ్గిపోయిందని వ్యాపారస్తులు అంటున్నారు. రోడ్లపై వ్యాపారం చేసే తోపుడు బండ్ల వ్యాపారులు చాలా అవస్థలు పడుతున్నారు.

నిర్మానుష్యంగా మారిన వేంపల్లె నాలుగు రోడ్ల కూడలి

పట్టణంలో సంచరిస్తున్న పందులు

పందులతో పరేషాన్

- పేరుకే ప్రకటనలు

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని ప్రజల పందుల బెడదతో పరేషాన్ అవుతున్నారు. పట్టణంలోని నాగులకట్ట, బిసి కాలనీ, ఎత్తపువారి కాలనీ, భాగ్యనగర్ కాలనీలలో పందుల బెడద అధికంగా ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు మాత్రం పందులు లేని పట్టణంగా జమ్మలమడుగును తీర్చి దిద్దుతామని ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ ఆచరణలో కన్పించకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇళ్ల మధ్యనే పందులు తిరగడం వల్ల పలు వ్యాధులు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. చిన్న పిల్లలు తిను బండరాలు చేత పట్టుకొని వెళ్లినప్పుడు వెంటపడుతున్నాయని దాంతో పిల్లలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. ద్విచక్ర వాహనాలకు అడ్డంగా రావడంతో కిందపడిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఐదు నెలల నుంచి పట్టణంలోని ఆయన కాలనీల్లో ఎక్కువగా తిరుగుతున్నాయని, సంబంధిత అధికారులు స్పందించి వాటిని గ్రామానికి వెలుపల లేదా పందుల యజమానులతో మాట్లాడి దూరంగా వదిలేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ పాఠశాల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- సింహాద్రిపురం

మండలంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ట్రిపుల్ ఇ విభాగంలో తృతీయ సంవత్సరం చదువుతున్న ఎస్. ఇ. దావూద్ హుస్సేన్ 2024 ఎపి ఈ-సెట్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ కె. తాతాజీ, ట్రిపుల్‌ఇ హెచ్‌ఒడి డాక్టర్ ఏ. శివశంకర్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఎపి ఇ సెట్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థి దావూద్ హుస్సేన్ 105 స్టేట్ ర్యాంకు సాధించారన్నారు. తమ కళాశాల నుంచి ఇలాంటి ప్రతిభావంతుల విద్యార్థులు రాణించడం గర్వకారణం అన్నారు. ఇది మిగతా విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థి దావూద్ హుస్సేన్ మాట్లాడుతూ తనను ప్రోత్సహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కళాశాల వద్ద ప్రత్యేక అభినందన సభను నిర్వహించారు. ఇందులో సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులతో ఉపాధ్యాయురాలు

విభిన్న ప్రతిభావంతుల పిల్లలు గుర్తింపు

ప్రజాశక్తి-చెన్నూరు

మండలంలో విభిన్న ప్రతిభావంతుల పిల్లల నమోదు ప్రక్రియ సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాలు మేరకు, ఎంఇఒలు గంగిరెడ్డి. సునీత వారి సహకారంతో నిర్వహిస్తున్నట్లు చెన్నూరు భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు టి శ్రీదేవి, కళావతి తెలిపారు. శుక్రవారం కొండపేట గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో దివ్యాంగ పిల్లల నమోదు సర్వే నిర్వహించారు. సందర్భంగా మాట్లాడుతూ ఒక సంవత్సరం వయసు నుంచి 18 సంవత్సరాలు వయసుగల పిల్లలను గుర్తించి వారిని దగ్గర్లోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తారని తెలిపారు అలాగే భవిత కేంద్రంలో బుద్ధి మాంద్యం, వినికిడి, దృష్టిలోపం. శరబ్రాల్ పాలసీ, చలన వైకల్యం, మొత్తం 21 రకాల వైకల్యాలను గుర్తించి వారిని భవిత కేంద్రంలో చేర్పిస్తారని తెలిపారు. పిల్లలకు సమగ్ర శిక్ష తరపున అన్ని రకాల అలవెన్స్‌లు అందిస్తారన్నారు. భవిత కేంద్రంలో ప్రతి బుధవారం ఫిజియోథెరపీ డాక్టర్‌చే ఉచిత వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. పిల్లల నమోదు కార్యక్రమం జూన్ నెల 9 వరకు కొనసాగుతుందన్నారు.

కార్బన్ పౌడర్ రవాణా చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మాట్లాడుతున్న తహశీల్దార్ సౌజన్యలక్ష్మి

కార్బన్ పౌడర్‌ను నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ సౌజన్య లక్ష్మి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఎర్రగుంట్ల పట్టణ సరిహద్దుల్లోని నిడుజివ్వి గ్రామ పొలంలోని సర్వే నెంబర్ 360 లోని 1.31 ఎకరాల భూమిలో అనధికారికంగా కార్బన్ పౌడర్ నిల్వ చేసి సమీప సిమెంట్ పరిశ్రమలకు అక్రమ రవాణా చేస్తున్నారని అన్నారు. విషయం తెలిసిన వెంటనే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను కార్బన్ పౌడర్ నిల్వ కేంద్రం వద్దకు పంపి అక్రమ రవాణాను అడ్డుకున్నట్లు తెలిపారు. పరిసర గ్రామ ప్రజల ఆరోగ్యాలు దెబ్బతీసేలా కార్బన్ పౌడర్ నిల్వలు, అక్రమ రవాణా చేస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్బన్ పౌడర్ రవాణా జరగకుండా రెవెన్యూ సిబ్బందిని నిల్వ కేంద్రం వద్ద ఏర్పాటు చేశామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా కార్బన్ పౌడర్ అక్రమ రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేలా సీఐ ఈశ్వరయ్యకు లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. కార్బన్ పౌడర్ నిల్వ ఉన్న భూ యజమానికి కూడా నోటీసులు జారీ చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పట్టణంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పాల్గొని తమ సంతోషాన్ని వ్యక్త పరిచారు. అనంతరం జరిగిన కళా నృత్య ప్రదర్శనలు అంబరాన్ని అంటాయి. కార్యక్రమంలో కళాశాల కర్పడెంట్ ఎ. నారాయణరెడ్డి, పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంఉద్దేశించి ప్రసంగించారు. ఈ వేడుకలో డైరెక్టర్లు సి. వెంకట సుబ్బారెడ్డి, ఎ. నీరజా, ప్రిన్సిపల్ వై. నారాయణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE: KADAPA

Insolvency Petition No. 34 of 2020.

Between:
Maram Venkata Reddy Son of late Gangi Reddy, aged about 64 years, Hindu, Business, residing in D.No.45/179, Balaji Nagar, Kadapa City.
...Petitioner/Debtor.

And

54. G. Nagaraju Son of G. Papulamma, aged about 36 years, Hindu, Employee, resident of D.No. 45/172, Balaji Nagar, Kadapa City
55.G. Padmavathamma Daughter of G. Papulamma, aged about 33 years, Hindu, Employee, C/o Bandi Subba Reddy's house, Near Groundnut Factory, Chemmumiyapet, Kadapa City
...Respondents No.,54 & ,55

NOTICE TO RESPONDENTS Nos. 54 & 55

Please take notice that the petitioner have filed the above I.P. is filed against you for losses in the businesses, the respondents are trying to detain the petitioner, for repayment of the amounts borrowed from them and the case stands posted for your appearance either personally or through an advocate, at 10.30 A.M. on **20.06.2024** before the said court and if you fail to appear, matter will be decided exparte.

M.SURESH KUMAR, M.A.B.L.,
Advocate, Kadapa
Cell: 9440673990

విద్యార్థి విజయమే 'శ్రీ విద్యాధరి' లక్ష్యం

దేవి ప్రసాదరెడ్డి

హేమలత

విద్యాధరి పాఠశాల భవనం

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

సామాన్యుడిని అసామాన్యుడిగా తీర్చి దిద్దడమే 'శ్రీ విద్యాధరి' ఉన్నత పాఠశాల లక్ష్యం అని శ్రీ విద్యాధరి రూరల్ వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ సొసైటి అధ్యక్షులు కె.దేవీప్రసాద్‌రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల మట్టిలోని మాణిక్యాలను వెలికి తీయాలని ఇందుకు చదువును ఆయుధంగా మలచుకోవాలని 'విద్యార్థి విజయమే -విద్యాధరి ఆశయం, బోధనే మా అయుధం-విద్యయే మా ఆభరణం' అనే నినాదంతో విద్యాధరి ఉన్నత పాఠశాలను 1999లో స్థాపించిన దేవీ ప్రసాద్‌రెడ్డి 'ప్రజాశక్తి' తో మాట్లాడారు. ఆరోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో చదువుపై పెద్దగా అవగాహన ఉండేది కాదని, వ్యవసాయం, పాడిపశువులు, బేల్దారి పని మినహా ఎలాంటి ఆదాయ వనరు ఉండేది కాదని తెలిపారు. నిరక్షరాశ్యత తాండవించే రోజుల్లో గ్రామీణ ప్రాంతాల పిల్లలకు చక్కటి విద్యను అందించాలనే లక్ష్యంతో పాఠశాలను స్థాపించినట్లు ప్రసాదరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా తిరిగి చదువు ప్రాధాన్యతను వివరించానన్నారు. అక్కడి పిల్లలకు చదువుపై దృష్టి సారించానని చెప్పారు. ప్రొద్దుటూరుకు సమీపంలోని గోపవరం పంచాయతీ పరిధిలో 'శ్రీ విద్యాధరి హైస్కూల్' పేరుతో విద్యా సంస్థలను స్థాపించానన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఆదాయాన్ని పక్కన పెట్టి విద్యాభివృద్ధే ధ్యేయంగా మొదటగా తానే విద్యాలయాన్ని స్థాపించానన్నారు. నలుగురు సిబ్బంది 60 మంది విద్యార్థులతో ప్రారంభించిన పాఠశాల అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం 800 మందికి పైగా విద్యార్థులతో 60 మంది బోధన, బోధనేతర సిబ్బందితో అలరారుతూ 2023-24 విద్యాసంవత్సరానికి 97శాతం ఫలితాలను సాధించామన్నారు. తమ విద్యార్థులు ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభ అవార్డులు దక్కించుకున్నారన్నారు. తమ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి వ్యవసాయం, జలవనరులు, పంచాయతీరాజ్, విద్యవైద్య తదితర ప్రభుత్వ శాఖలతో పాటు సాఫ్ట్‌వేర్ రంగంలో మంచి స్థాయిలో ఉన్నారని అన్నారు. త్వరలో పూర్వవిద్యార్థులతో గోల్డన్‌జుబ్లీ ఉత్సవాలను నిర్వహించబోతున్నట్లు తెలిపారు. 1993లో ఒకవైపు చదువుకుంటూనే మరో వైపు ప్రయివేట్ పాఠశాలలో ప్రొద్దుటూరులో ఉపాధ్యాయునిగా పనిచేశానని కర్నూల్‌లో బిఇడి పూర్తి చేసిన తనకు విద్యపై మమకారం ఎక్కు వన్నారు. కేవలం చదువుతోనే మనిషి ఉన్నత శిఖరాలకు చేరుకుంటాడని ఆ చదువు ద్వారానే తనతో పాటు తన వారిని కూడ ఉన్నత స్థితికి తీసుకెళ్తాడని ఇందుక ఎన్నో ఉదంతాలు మన చుట్టూ ఉన్నాయన్నారు. ఆ ఆపేక్ష, మమకారమే తనను విద్యాలయాన్ని స్థాపించేందుకు దోహద పడ్డా యన్నారు.పాఠశాల కరెస్పాండెంట్ హేమలత ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రమశిక్షణకు, నైతిక విలువలకు చదువుకు సమానంగా ప్రాదాన్యత ఇస్తు న్నామన్నారు. విద్యతో పాటు బుద్ధులు నేర్పించే వారే నిజమైన ఉపాధ్యా యులన్నారు. మెబైల్‌ఫోన్ల వల్ల, సినిమాలలోని చెడు వల్ల పిల్లలు విక్ర మార్గం పట్టే అవకాశం అధికంగా ఉందని అన్నారు. ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడ అతిగారాబం మాని మంచి పౌరులుగ తయారు చేసేందుకు సహకారం అందించాలన్నారు. విద్యార్థి దశలో కేవలం విద్యపైననే ఏకాగ్రత ఉంచాలని ఇతర త్రావాటిపై దృష్టి పెట్టకూడదని అప్పుడే దేశం గర్వించే మంచి పౌరులుగా ఎదుగుతారని దేవి ప్రసాదరెడ్డి అన్నారు.

అవాంఛనీయ సంఘటనలకు పాల్పడరాదు : డిఎస్‌పి

సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి యశ్వంత్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు, ఎర్రగుంట్ల పట్టణాలు, నియోజకవర్గ పరిధిలోని ప్రజలు ఎక్కడే కానీ అవాంఛనీయ సంఘటనలకు పాల్పడరాదని జమ్మలమడుగు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి టిడి యశ్వంత్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న కౌంటింగ్ రోజు జమ్మలమడుగు మొత్తం కర్ఫ్యూ ఉంటుందన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉండడం వల్ల ఎక్కడా ప్రజలు గుమికూడరాదన్నారు. పట్టణంలో అన్ని దుకాణాలు మూత వేయాలని చెప్పగా అందుకు వారు స్వచ్ఛందంగా సహకరిస్తామన్నారు. జమ్మలమడుగు పట్టణానికి వచ్చే అన్ని దారులలో చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. పెట్రోల్ బంకు, ఫైర్ ప్యాకర్స్ వారికి నోటీసులు ఇచ్చామని తెలిపారు. 6వ తేదీ వరకు ఎలాంటి సంబరాలు జరుపుకోవడానికి వీలు లేదన్నారు. ఏ పార్టీ గెలిచిన శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని ప్రవర్తించాలన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని చెప్పారు. పట్టణంలో క్యూఆర్ టీములు, 14 మొబైల్ టీములు పనిచేస్తాయన్నారు. 400 మందితో బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎర్రగుంట్ల జమ్మలమడుగు పట్టణాలలో పార్టీ కార్యాలయాలు ఉండడం వల్ల ఎక్కడే గాని అవాంఛనీయ సంఘటన జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అందుకు ప్రజలు, పార్టీల నాయకులు పూర్తిగా సహకరించాలని కోరారు. లేనిపక్షంలో చట్టపరమైనటువంటి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రైనీ డిఎస్‌పి శ్రీకాంత్, అర్బన్ సిఐ కరుణాకర్, ఎస్ఐ కల్పన సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఆంక్షలు కఠినతరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఈనెల 4 ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఆంక్షలు కఠినతరం చేశామని డిఎస్‌పి మురళీధర్ పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 139 మంది ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించామన్నారు. ఆరుగిరిని జిల్లా బహిష్కరణ, బైండవర్ పెట్టిన వారిలో మళ్లీ కేసులు నమోదైన వారి ఆస్తుల జప్తుకు చర్యలు చేపడతామన్నారు. ఏ పార్టీ వారైనా ఇబ్బందికరమైన పరిస్థితి కలగజేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రొద్దుటూరులో 64 సిసి కెమెరాలు పనిచేస్తున్నాయని, బాణాసంచా నిషేధమని, ఎవరు పేల్చినా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎన్నికల కమిషన్ రూల్స్ విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. కొందరికి జిల్లా బహిష్కరణ,కొందరికి గృహనిర్బంధం రేపటి నుంచి బందోబస్తు అమల్లోకి వస్తుందన్నారు. చట్ట విరుద్ధమైన పనులకు అల్లరి మూకలపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో 1టౌన్ సిఐ, 2టౌన్ సీఐ, 3టౌన్ సీఐ, రూరల్ సిఐలు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి మురళీధర్

IN THE COURT OF THE 3rd ADDITIONAL JUNIOR CIVIL JUDGE: KADAPA

Original Suit No. 131 of 2022.

Between:
Pawar Ravi Prakash Rao, Son of P.Mukunda Rao, aged about 56 years, Hindu, Retired Army Constable, resident of D.No.21/40, Guntha Bazaar, R.S.Road, Kadapa City and District-516001.
...Plaintiff

And

Syed Abdul Azeem, Son of Syed Abdul Salam, aged about 39 years, Muslim, Business, D.No. 18/175, Syed Miya Street, Masapeta, Kadapa City & District. **...Defendant**

ప్రతివాదికి నోటీసు

ఇందు మూలంగా తెలియజేయడమేమనగా ప్రతివాది హాజరు నిమిత్తము తేదీ.11-07-2024 ఉదయం. 10.30 గంటలకు పై కోర్టు నందు వాయిదా కలదు. మీ హాజరు కొరకు వాయిదా వున్నది. కావున స్వయంగా కాని, వకీలు ద్వారా కాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలయును లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
యం. సురేష్ కుమార్
అడ్వకేటు, కడప. సెల్ 9440673990

దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

ఊటుకూరు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఆచారి తెలియజేశారు. ఊటుకూరు వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలో రెండు సంవత్సరాల వ్యవసాయ సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ ఫార్మింగ్, వ్యవసాయ ఇంజినీరింగ్‌కు సంబంధించిన డిప్లమా కోర్సులు అందుబాటులో ఉన్నాయని, వైఎస్ఆర్ కడప జిల్లాలోని పదవ తరగతి పూర్తి చేసిన, ఇంటర్మీడియట్ పూర్తి చేయని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోనందుకు ఈనెల 1 నుంచి 20 లోపు దరఖాస్తు చేసుకో వాలన్నారు. మిగతా వివరాలకు 9000523420లో సంప్రది ంచాలన్నారు.

ముస్తాబైన ఆంజనేయ స్వామి ఆలయం

హనుమాన్ జయంతికి ముస్తాబైన ఆలయాలు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయాలను జయంతి ఉత్సవాలకు ఆలయ కమిటీ ముస్తాబు చేసింది. శనివారం తెల్లవారుజాము నుంచి ఆంజనేయస్వామికి ప్రత్యేక, అభిషేక, అర్చన, పూజ అలంకరణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయం, తూర్పు ఆంజనేయ స్వామి ఆలయం, కొత్త బస్టాండ్ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంతో పాటు కె. వేలంవారి పల్లెలోని ఆంజనేయస్వామి ఆలయాలలో ఆంజనేయ స్వామి జయంతి ఉత్సవాలను నిర్వాహకులు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఆలయాలలో పూజా కార్యక్రమాలతో పాటు మధ్యాహ్న సమయంలో అన్నదాన కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. పూజ కార్యక్రమాలు అనంతరం సాయంత్ర సమయంలో స్వామి వారి గ్రామోత్సవ కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నారు. కార్యక్రమాలలో స్వామివారి భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని అలాగే అన్న ప్రసాద కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ఆయా దేవాలయాల ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు. **జమ్మలమడుగు రూరల్ :** ఆంజనేయ స్వామి వారి జయంతి సందర్భంగా గండికోట శ్రీ రామగిరి అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం నుంచి స్వామివారికి బ్రహ్మశ్రీ గడియారం గిరినాథ శర్మచే పూజలు అర్చన అభిషేకాలు, సాయంత్రం స్వామి వారికి తమలపాకుల పూజ నిర్వహిస్తారన్నారు. రాత్రి 7:00గంటలకు వేపరాల వారిచే భజన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి అల్పాహారం ఉంటుందని చెప్పారు. భక్తులందరూ విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి - వల్లూరు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఇఒలు లిల్లెమ్మ, పి.విజయ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పాఠశాల పనిచేస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకులకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ విద్యార్థులకు వంట తయారు చేసినప్పుడు వంటలకు సంబంధించిన వస్తువులు పరిశుభ్రం చేసుకోవాలన్నారు. చుట్టూ ఉన్న పరిసరాలనూ శుభ్రం చేసుకుని నాణ్యమైన భోజనం తయారు చేయాలని సూచించారు. రీసోర్సు పర్సన్ ఎస్.శివకుమార్ రాజు మెనూ మొత్తం క్లుప్తంగా వీడియోల ద్వారా వివరించారు. రాష్ట్రస్థాయిలో శిక్షణకు హాజరైన రీసోర్సు పర్సన్లు శేఖర్ మాట్లాడుతూ వంట ఏ విధంగా చేయాలో తెలియజేశారు. అనంతరం సహాయకులకు వంటల పోటీ నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఎం. సురేష్ బాబు, ఎంఆర్‌సి సిబ్బంది ఓబయ్య, వంట నిర్వాహకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒలు